
స్నయ కల్యాణం
ఎమ్మెస్సార్. మూర్తి
ఆంగీరస ఉగాది కథల పోటీలో
తృతీయ బహుమతి పొందిన కథ.



[illegible]
ఆంగికం భువనం యస్య వాచికం సర్వవాఙ్మయమ్ ఆహార్యం చంద్రతారాది తం వందే సాత్త్వికం శివమ్” అంటూ నటరాజ స్వామికి నమస్కరించి -స్టేజి మీదికి వెళ్ళ బోయే ముందు అద్దంలో చూసుకున్నాను.

నవ్వుకున్నాను !
ఇలా ఎన్నిసార్లు నవ్వుకున్నానో !

* * *

కిట కిటలాడుతున్న ఆడిటోరియం వాసన - నా ముఖానికున్న కేక్ సువాసనలను మరపిస్తోంది.

ఇంగ్లీష్‌లో, తమిళంలో, తెలుగులో నా గురించి పరిచయ వాక్యాలు చెప్తున్న కంపీర్ “ఈ అదృష్టవంతు రాలికింకా పెళ్లి కాలేదు. ఆ అదృష్టవంతుడెవరో” అంటోంది.

అడపా దడపా విదేశంలోనూ, యావత్ భారతదేశంలోనూ నాట్యం చేసిన నన్నూ నా పాతికేళ్లనూ పెళ్లి చేసుకోడానికి...

ఎవరూ రాలేదు. పాములంటే నెమలికి పడదు అందుకే !

ఎంతో మంచి చెప్పి పంపారు.

మణులతో ఉన్న పాములంటే కూడా నెమలికి పడదు, అందుకే !

నేను ముద్రలో ఉండగా తెర తొలగుతోంది.

వాద్యాల శృతి సఖ్యంతోపాటు ప్రేక్షకుల మాటలూ సద్దు మణిగాయి.

‘శ్రీమత్ సమస్త సద్గుణ నయ వినయ వివేక వితరణ విచక్షణ దక్షా...
గద్య పద్య వచనస్తు వచన మీమాంస
యోగాది శాస్త్ర పారీణా...
సంగీత సాహిత్య సకల కళాప్రవీణా...
సర్వేశ...
దిత్తళాంగ్ తక తళాంగ్ తక దిక్
తందిత్తై దిత్తాందిత్తై దిత్తాందిత్తై

ఇలా సంగీత తాళ లయ బద్ధంగా పురుషులని ప్రార్థించి ప్రార్థించీ ఆడవాళ్లెంత పరాధీనులయ్యారూ !

* * *

మనిషి ముఖం రంగస్థలమనుకుంటే... మనసే ఆడియన్సు !

ప్రేక్షకుల్లాగా మనను చీకట్లో ఉంటుంది - పోనీ మనసులాగా చీకట్లో ప్రేక్షకులుంటారు. వాళ్లేమను కుంటున్నారో మనం గ్రహించలేం.

కానీ నాట్యం చేసే స్త్రీ పట్ల ఆడా మగా అందరికీ అదే ఆలోచన.

ఆ తర్వాత ఈ కళాకారిణి “అదీ” - “ఇదీ” అనబడుతూ ఓ వస్తువుగా.....

కంపీర్ చెప్తోంది...

కృష్ణ దర్శన మాత్రం చేతనే వస్త్రము వీడిపోవ,
మొలనూలు జారిపోవ, ఏమీ ఆచ్ఛాదన లేక యున్న
నీ జఘనమును చిగురు పాన్పునందు
ఆనంద దాయకమైన నిక్షేపంలాగా ఉంచరాదో.
అంటుంది సఖి రాధతో.
ఏకతాళం మొదలవుతుండగా తెర తొలగుతోంది.

* * *

రతిసుఖసారే గత మభిసారే
మదన మనోహర వేశం
నకురు నితంబిని గమన విళంబన
మనుసరతం హ్రదయేశమ్-
ధీరసమీరే - యమునాతీరే - వసతి వనేవనమాలీ...

రెండో వరసలోని ఫారినర్సు ముగ్ధులవుతున్నారు. మొదటి వరసలోని సూటాయన పక్కనున్నావిడతో ఏదో అంటున్నాడు.

ఏమంటాడు?

అష్టపదులన్నీ పరమ పోర్నో

“పోర్నో” అంటే ఏవిటని ఇటు పక్కగా నున్న భార్య అడిగే ఉంటుంది.

“పోర్నో” అంటే ‘బూత’ని రవీంద్ర భారతిలో చెప్పలేక తర్వాత చెప్తాలే అంటాడు.

* * *

కంపీర్ చెప్తోంది.

అండమూ, పిండమూ, బ్రహ్మాండము మూడూ ఒకే మూస. గర్భస్థ శిశువు ఎలాగో జీవించే మనిషీ అంతే. అలాగే ఈ ప్రపంచం కూడా అందుకే-

ఆంగికం భువనం అంటే ఈ భువనమంతా శరీరంగానూ, వాచకం సర్వవాఙ్మయమ్ సర్వవాఙ్మయాలూ అతని వాచకంగానూ సూర్యచంద్రులు అలంకారాలుగానూ ఉన్న శివునికి నమస్కరిస్తున్నాను అంటుంది నాట్య శాస్త్రం.

* * *

ఇపుడు నందుని ఇంట శ్రీకృష్ణ జన్మము వినిని గోకులం ఎలా ఉందో అభినయించబడుతోంది

అందుకే గదా ఏ స్త్రీ అయినా పెళ్లి కావాలనుకునేది ! నేనూ అంతే !

* * *

వనాన్ని అభినయించి సకల విధ వృక్షాలూ చిగురించి పుష్పించాయని చూపించాను. పుష్ప పరిమళాలు దిక్కులు నిండాయని తల తిప్పాను. మకరందపాన మత్తులయిన తుమ్మెదల ఝుంకారం వినిపించాను. ఫల భారంతో వంగిన చెట్లు భగవంతునికి సాష్టాంగ పడ్డట్టు చూపించాను. పుష్పలతలు మందమారుతంతో చలిస్తూ పుష్పాలు రాలుస్తూ....

అయినా కృష్ణ లీలాతరంగిణి అనటే నారాయణ తీర్థ వీరికి గుర్తుకొస్తాడా? సంస్కృత భాషా సౌరభం పసికట్టారా? దాన్లో పన్నెండు తరంగాలని అవన్నీ మనింట్లో జరిగే విషయాలనీ- అందరికీ తెలుస్తుందా-? కృష్ణ అనగానే ఈ గోపికలు, అల్లా రాధ- ఆవేవో రహస్య క్రీడలు- అవీ తమవే అయినట్లు కలవరపడిపోవడం-

ఖగ మృగ నారీ నారాదయః సర్వేచజనాః
సంప్రాప్త స్వస్వ సంపదో బభూవుః

ఆడియన్స్‌లో...

ఆ నాలుగో వరుసలోని... అతని చెంపలనిండా కన్నీరు ! ఎందుకో?!? అడుగులు తడబడుతుండగా లోపలికి వచ్చి- సెక్రటరీకి అతనిని చూపించి పిలిపించాను.

నా నృత్యంలో అభినయంలో అతనికి కలిగిన బాధే మిటోనన్న వేదన గ్రీన్ రూంలో నా కాలు నిలవనివ్వలేదు.

‘నమస్కారం అన్నాడు.

ఎంతో అందంగా- ఆర్ద్రత ఉట్టిపడే ముఖం.

‘నమస్కారం’ చేశాను వినయంగా,

ఆపాదమస్తకం చూస్తూ, - తలవంచుకుంటూ - మళ్ళీ చూస్తూ -

“మీ కంటి నీరు చూశాను. కారణం ఏమిటో తెలుసుకో వచ్చా-” అడిగాను.

“మీరు... మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటానంటే ఒప్పుకో రేమోనని-”

సిగ్గుపడిపోయాను.

“అని మీరనుకుంటారేమో ! అదీ నిజమనుకోండి - కాని - మీ శరీరంలో ప్రతిఅణువూ భగవంతునికే అంకిత మైందనీ, అదే ఈ భువనమనీ మీరు అభినయిస్తుంటే... అలా కన్నీళ్ళొచ్చాయి.”

“దీన్లో...అంత... బాధపడాల్సింది.. ఏవుంది ?”

“మరో వంద సంవత్సరాల తర్వాత మన భూప్రపంచం ఏమవుతుందో అంచనా వేసే వృత్తినాది.

ఎన్విరాన్‌మెంట్- అంటే పర్యావరణకి సంబంధించిన శాఖలో యునెస్కోలో సైంటిస్టుని...”

నాకు మరేమీ.. కన్పించడం లేదు - నేనేం చేస్తున్నానో తెలియడం లేదు. ఒక్క ఉదుటున రంగస్థలం మీదికెళ్ళి వాద్యకారులను ప్రసన్నంగా లయగా చూసి ప్రారంభించాను.

యో గోపీ నయనోత్పలై రనుపమైరారాధితో గోకులే
గోభిర్గోపనుతై రనేక మునిభిర్భృత్యైర్మ కౌంతరే
మాయా మానుష విగ్రహస్య మరుతస్సే వాలఖిల్యాదయో
రుక్మిణ్యాస్సతతాం వివాహ సమయే కుర్వంతుతే మంగళమ్

మా పెళ్ళయ్యాక వారికో సందేహం. ‘అది సరే - నేను ముందే చెప్పాను.. నువ్వెందుకు నాకు నచ్చావే. కానీ - నువ్వింత వరకూ చెప్పనేలేదు నేను నీకెందుకు నచ్చానో” అంటూ అడిగారు.

ప్రతి స్త్రీ శరీరంలో పాలిటిక్స్, శరీరంతో పాలిటిక్స్ చూస్తున్న మగాళ్ళ మనస్తత్వాన్ని నేనెలా అభినయించ గలను ?

అన్నాను.

యతో మనః తతో భావో
యతో భావః తతో రసః

“అంటే ?”

“మీ మనసే రసమయ సరోవరమనీ...”

హంసలా వారి ఎదలో వదిగిపోతూ అన్నాను.